# ఘోరశత్రువు

యం. వి. శ్రీనివాసరావు

ఒకనాటి రాత్రి జ్ఞానం నిద్రపోతూండగా భగవంతుడు స్వప్నంలో ప్రత్యక్షమై—జ్ఞానం! లే, లే. ప్రపంచాన్నుద్ధరించడానికి నిన్ను నా ప్రతినిధిగా పంపించా. వెంటనే నీ కర్తవ్యాన్ని నిర్వర్తించుకుంటానికి ఉద్యుక్తడవు కమ్మ—అని మేల్కొల్పాడు.

జ్ఞానం తటాలునలేచి కండ్లు నలుపుకుంటూ అటునిటు పరికించిచూచాడు.

ప్రపంచం అంధకారంలో చిక్కుబడిపోయింది. మానవజాతి అగాధ తమసంలో త్రోవతెలియక తప్పుదారినిబడి వినాశమను గమ్యస్థానమునకు త్వరితగతిపోతూ వుంది.

జ్ఞానం పరమాత్మయొక్క ప్రతినిధి. మానవజాతికి నాయకుడు. అంధకారాన్ని వెడలగొట్టి సమాజాన్ని ఉన్నత మార్గంలోనికి గొంపోవుటయే వానికర్తవ్యం.

జ్ఞానం ఒక కూడలిస్థలానికిపోయి—"నేను భగవద్దూతను. ఈశ్వర ప్రతినిధిని. మిమ్ముల నుద్ధరించుటకు నేనొక సందేశాన్ని గొనితెచ్చా—అని ప్రజాసమూహానికి ప్రబోధించాడు.

కాని ఆ మాటెవ్వరూ వినిపించుకోలా. శ్రోతలందరు అతన్ని పరిహసించారు. మానవజాతికంతకూ వీ డొక్కడే వెఱ్ఱివాడని, తమ మతానికి విరుద్ధంగా ప్రచారం చేస్తున్నాడని నాస్తికుడని హెచ్చరించి ఆ జ్ఞానంను కొట్టడానికి మీదికురిగారు. పాపం, పిల్లవాళ్లుకూడ రాళ్లు రువ్వడం మొదలుపెట్టారతని మీద.

* * *

ఈ నానావిధ వ్యాఖ్యాన శరపరంపరలతో విసుగుజెంది, గహ్వర బంధురమైన ఒక ఖురుకుసందులో మూలకూర్చొని తన మనస్సును ఆలోచనార్ణవంలోకి పోనిచ్చాడు. కెరటాల దెబ్బలతో అలసిసొలసి—మానవజాతికి ప్రాణశత్రువు మతం ఆ మత పిశాచాన్ని ఎదుర్కొని పోరాడితీరాలి—అనే అంతిమ నిర్ణయానికివచ్చాడు.

అప్పుడే ఎక్కడనుండో ఒక స్త్రీయొక్క కరుణాక్రందనం అతని చెవుల్లో ప్రతిధ్వనించింది. తత్తరపాటుతో అతడు లేచి చూచాడు.

ఆ స్త్రీ నిస్పృహచెందియున్న తన బిడ్డతో ఆ సందులోపడి మూల్గుతూవుంది.

జ్ఞానం అడిగాడు—సోదరీ! ఏడ్చెదవెందుకమ్మా—అని.

ఆ స్త్రీ—"నేనొక మతచ్యుతుణ్ణి వివాహమాడా. ఈ విషయం సంఘానికి అవగతమయ్యింది. వెంటనే నాభర్త సంఘదౌష్ట్యానికి బలియయ్యాడు. నేను సంఘంలోంచి వెడలగొట్టబడ్డా. నా ముద్దు బిడ్డడు ఈ విధంగా ఆకలిబాధతో అడిలి ఒడిలిపోతున్నాడు—అని తన దీనాలాపం వినిపించుతుంది.

కరుణా ప్రదమైన ఈ దృశ్యాన్నిచూచేటప్పటికి అతని నిశ్చయం ద్విగుణీకృతమైంది.

మృదుభాషణతో ఓదార్చి—రక్షించెదనని అభయమిచ్చి—ఆమెను తనవెంట తీసికొనిపోయాడు.

అప్పట్నుంచీ—మతం సత్యదూరమైన బంధం. పరమాత్మ ఒక్కడే మతాతీతమైనవాడు. మతమే మనలను పరమాత్మనుండి వేఱుపరచి పెడబాటలోనికి త్రిప్పి కంటక సంకటమై ప్రతిక్షణం కలకవేస్తూవుంది. కనుక మతము మన అగర్భశత్రువు—అని మత విరుద్ధమైన తీవ్రప్రచారం చేయసాగాడు జ్ఞానం.

గభాలున ప్రజల్లోనుంచి ఒక ప్రముఖుడు లేచి—బహిష్కరింపబడిన స్త్రీని వెంటబెట్టుకొని ప్రచారంచేస్తూవుంటే, నీమాట వినేవాడెవ్వడు? కాబట్టి నీవుకూడ బహిష్కరింపబడ్డావు. ఛో, ఛో అంటూ నిర్లక్ష్యభావంతో ఆయన్ని దూషించారు. మిగతా వారందరు అతన్ని వెడలిగొట్టారు.

* * *

ఈ బహిష్కృతము అతని యాలోచనలో క్రొత్త మార్పుతెచ్చింది.—ఎప్పుడయితే సంఘాన్ని జయిస్తామో అప్పుడే మతాన్ని అంతరింపజేయగలం—అని నిశ్చయించుకున్నాడు.

అది మొదలుకొని జ్ఞానం ఈవిధంగా ప్రచారంచేయడం మొదలుపెట్టాడు—ఈ మతకర్తలు, ధర్మధ్వజాలు, పురోహితులు మొదలగు ఈ తిండిపోతు బొజ్జన్నలెవరు? ప్రపంచంలో వీరి ఆవశ్యకత ఎంతవరకున్నది? మానవ జీవితాన్ని నిర్ణీత హద్దులలో బంధించి యుంచడానికి వీరికే విధమైన హక్కున్నది? రండి ముందుకు పదండి ఈ దుర్మతావలంబులను లోకంలో అంతర్థానంచేసి పావనమైన నూతన సమాజాన్ని సృష్టిద్దాం—అని ఉద్రేకభరితంగా గర్జించాడు.

ఈవిధంగా ఉద్బోధించి ప్రజావర్గంలో విప్లవం రేకెత్తిస్తున్నాడని రక్షకభటు లిద్దరు వచ్చి జ్ఞానాన్ని అరెష్టుచేసి తీసుకుపోయారు.

* * *

జ్ఞానం తన శిక్షను పూర్తిచేసి తిరిగి విశాల ప్రపంచంలో అడుగుపెట్టాడు. అంతా ఒక్కసారి పరిశీలనా దృష్టితో చూచాడు.

పాలకులు మన యీ మతదౌష్ట్యాలను, సంఘదురాచారాలను ప్రేమతో పెంచుతూ, చిరజీవులమజేసి తద్వారా శాశ్వత లాభా న్ననుభవిస్తున్నారు.

కాబట్టి ముందు మనం ఈ క్రౌర్యకౌటిల్య కలుష బానిసత్వవంకాన్ని, మరింత వృద్ధి చేస్తున్న యీ పాలనా విధానపు బారినుండి విముక్తిచెందాలి అని దృఢపర్చుకుని పన్నాహాలు చేస్తున్నాడు.

*       *       *

ప్రత్యూషప్సంధ్యల వీచెడి పిల్లగాడ్పులకు రేగుతూ మెరుస్తూయున్న వెండిజరీ తలవెంట్రుకలు అతని వయస్సును నిర్ణయిస్తున్నాయి. పీలికలైన వస్త్రాలు అతని ఐశ్వర్య ప్రతిభను వెల్లడిచేస్తూయున్నవి. ముడతలుపడ్డ ముఖ మండలం అతని మనోభావాల్ని ప్రకటిస్తూవుంది. వెన్నునంటి శూన్యాలయమైన గర్భం అతని ఆకలిమంటను నిరూపిస్తూవుంది. కంకాళ సముడైన అట్టి దరిద్రనారాయణుడు. జ్ఞానంయొక్క సాన్నిధ్యానికివచ్చి—"నేను పరదేశిని. ఆకలిబాధ నన్ను దగ్ధంచేస్తూవుంది బాబయ్యా. తమరేదని పప్పగించినాసరే చేసుకుని జీవిస్తాను స్వామీ!"—అని జ్ఞానంకు స్వాభిప్రాయాన్ని వివిపించుకున్నాడు.

మూర్తీభవించిన ఆర్తదేవుని యొక్క అదీనాలాపాలు వినేసరికి జ్ఞానం ఖిన్నుడై—నేను నీకంటె ఏమాత్రం ఉన్నతదశలోలేను. క్షుద్బాధ నన్నుకూడా నీవలెనే కృంగదీస్తూవుంది.—అని కొంతవరకు ఆత్మకథ చెప్పాడు.

విరాశా సహితమైన ఆ జ్ఞానంయొక్క మాటలు ఆ పరదేశి కర్ణగతమయ్యే టప్పటికి వదనారవిందం మరింత వాడిపోయింది. మనస్సుకరిగి నీరై వాగై ప్రవహించి నష్టపోయింది. మీ దుఃఖాన్ని సహాయంగా చేసుకొని నాదుఃఖం మరింత హెచ్చిపోతూవుంది. నన్ను మీ సహచరుణ్ణిగా ఎంచుకోండి. నీ కరుణావీక్షణాలు నాపై ప్రసరింపజేయండి. చాలు బాబయ్యా చాలు....నాకు మీ సానుభూతి....మీకు పరమాత్మ సానుభూతి, అంగరక్షలు.—అని తన నిశ్చితాభిప్రాయాన్ని నివేదించుకున్నాడు.

*       *       *

ఈ విషాదఘట్టాన్నిచూచి జ్ఞానం కొంచెంసేపు ఊహా ప్రపంచంలోకివెళ్లాడు. చివరకు ఈ విధంగా తోచింది,—కడుపార తిండి తింటూన్నప్పుడుగదా దేశీయ విదేశీయప్రశ్న ఆహారమే జీవితానికి ముఖ్యాధారం. జీవించాలంటే తిండిలేమిని అంటే ఆకటిచిచ్చును ఆర్పివేయాలి. కనుక అన్నిటికంటె ప్రప్రధమ జన్మశత్రువు ఆకలిమంట. దీని నెదుర్కొని మన కర్తవ్యాన్ని పూర్తిచేసుకోవాలి—అని.

ఈ ఆశయాన్ని లక్ష్యంగాపెట్టుకుని ప్రచారంచేయడం మొదలుపెట్టాడు.—

—ప్రపంచంలో కొన్నికొన్నిచోట్ల గుట్టలైయున్న ధనమంతా లాక్కొని సరిసమానంగా పంచిపెట్టి సర్వసమానత్వాన్ని నెలకొల్పి విశ్వమానవ కళ్యాణాన్ని స్థాపించాలి. ఆకలిబాధ నసింపచేయాలి అని ఉద్బోధించి ఒక పెద్ద ఆకలి దండును లేవదీశాడు.

ఈ విషయాన్ని ధనికులు తమ గూఢచారులవల్ల గ్రహించి జ్ఞానంను పట్టుకుని ఒక కొండకోటలో బందీగ జేశారు. ఆ కోటలో అతనికి, పట్టెడన్నం, గ్రుక్కెడు నీళ్లుమాత్రమేపోసి మరింత ఏడ్పిస్తున్నారు.

పాపం క్రమక్రమంగా జ్ఞానంయొక్క హృదయం విచారసాగరంలో మునిగిపోయింది. జీవితం భరింపరాని బరువైపోయింది అతనికి.

"నేను జ్ఞానంను. సర్వాధారియైన పరమాత్మయొక్క ప్రతినిధిని. అయినప్పటికి పట్టెడన్నము లేకపోయెనే" అని వ్యాకులపడి జీవితంమీద విరక్తి కల్గించుకున్నాడు.

ఒకరోజున జ్ఞానం కోటగోడమీదనెక్కి, చుట్టునున్న కందకంలోని అగాధజలరాశిని చూస్తున్న సమయంలో, ఒకవిపరీతమైన తలంపు పుట్టింది—ఈజలంలోమునిగి పరమాత్మను కలసికొని "నేను నీ నియమిత ప్రతినిధినిగదా నేనుకూడ ఆకలిమంటతో మ్రగ్గిపోవలసివచ్చింది. నావంటి వ్యర్థజీవి ప్రపంచానికి బరువని తిరిగి నీదగ్గరకే వచ్చానని మొరపెట్టుకుంటా—అని"

జ్ఞానం అదేవిధంగా స్థిరమైన ముగ్ధ దృష్టితో కందకంలోని జలరాశిని చూస్తున్నాడు. దుముకుటకు సిద్ధం మున్న సమయంలో అతని ప్రతిబింబం నీటిలో చలించింది. అతనియొక్క విపరీత నిశ్చితాభిప్రాయానికి అసమ్మతిని సూచిస్తూ—నీవు నీతో యుద్ధంచేశావా? అని వ్యంగ్యభావంతో ప్రశ్నించినట్లుగా మరింతచలించింది.

*       *       *

జ్ఞానం తన మనస్సును స్థిమితపర్చుకుని నిశ్చేష్టుడై కోటగోడమీదనే నిలబడిపోయాడు. మెల్లగా కోటగోడమీదనుండి క్రిందికి దిగి కోటలో తిరుగుతూ అంతిమ నిర్ణయానికి తపిస్తున్నాడు

*       *       *

—సులభమైన మార్గంకొరకు ప్రయత్నించడంవలననే మానవుడెప్పుడు కష్టాలకు గురియౌతున్నాడు—అని జ్ఞానంకు అంత్య సందేశం దొరికింది.

*       *       *

తరువాత జ్ఞానం విడుదలచేయబడ్డాడు. అల్లకల్లోలంతో నిండియున్న ఈ మహా ప్రపంచంలో నిలువలేక శాంతి మహా సముద్రంలో స్నానం చేయబోయాడు.